క్లుప్తంగా

రైతులకు తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ



పొన్నూరు: మండలంలోని కసుకర్రు గ్రామ రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. గుంటూరు కృష్ణనగర్‌లోని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు స్ప్రేయర్లు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి ఉషారాణి, వైఎస్సార్ సీపీ నేత నాగిశెట్టి నరసింహ, రైతులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీరమ్యకు ఘనంగా వీడ్కోలు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ప్రజలను ఎన్నటికీ మరిచిపోలేనని ఎంపీడీవో ఏ. శ్రీరమ్య అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆమె విజయవాడకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ, డీపీవో కె. శ్రీదేవితో పాటు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు శ్రీరమ్యను దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. తనకు విధుల్లో సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి, అధ్యాపకుడి లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నిమ్మగడ్డ శ్రీరామ్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసిందన్నారు. ఆయన నోవెల్ మెటల్ ఆక్సైడ్ నానో స్ట్రక్చర్స్ ఫర్ ది పొటోకెటలిక్ డిగ్రెషన్ ఆఫ్ టెట్రాసైక్లిన్ అండర్ విజిబుల్ లైట్ ఇర్రేడియేషన్ అనే అంశంపై డాక్టర్ వి. అరుణ పర్యవేక్షణలో పరిశోధన చేసినట్లు తెలిపారు. అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు కె. శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్, డైరెక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎస్.వి.శ్రీనివాసరావు, ఎల్.వి. రమణమూర్తి అభినందించారు.

బాజీ బాబా దర్గా వద్ద అన్న సంతర్పణ



పెదకాకాని: స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సహకారంతో శుక్రవారం రాత్రి దర్గా ప్రాంగణంలో భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్రవ్యాప్తంగా అధికసంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు. వారిలో కొందరు రాత్రిపూట ప్రాంగణంలోనే నిద్రలు చేసి ఆ తరువాత రోజు ఇళ్లకు వెళతారు. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా భోజనాన్ని ఎమ్మెల్యే పేరిట భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభాని, దర్గా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సుద్దపల్లిలో గోడౌన్ ప్రారంభం



చేబ్రోలు: మండలంలోని సుద్దపల్లిలో నూతనంగా నిర్మించిన గోడౌన్‌ను పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య శనివారం సాయంత్రం ప్రారంభించనున్నట్లు వేజండ్ల పీఏసీఎస్ చైర్మన్ చందు సాంబశివరావు శుక్రవారం తెలిపారు. నాబార్డు మంజూరు చేసిన రూ.46లక్షల వ్యయంతో రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకోవటానికి ఉపయోగపడే విధంగా అన్ని సౌకర్యాలతో నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని వివిధ ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా ఉంటా!

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని
- బ్రహ్మారథం పట్టిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- తెలగాయపాలెంలో గుండె గుండెకు జగనన్న–గడప గడపకు కిరణన్న



తెలగాయపాలెంలో కిరణకుమార్‌కు ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు

తెలగాయపాలెం(కాకుమాను): ''రాజకీయ నాయకుడిలా కాకుండా ప్రతి ఇంటికీ పెద్ద కొడుకులా ఉంటూ మండలంలో ఏ ఒక్కరికీ ఎలాంటి సమస్య వచ్చినా అరగంటలో మీ ముందుటా''నని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలోని తెలగాయపాలెంలో శుక్రవారం సాయంత్రం గుండె గుండెకు జగనన్న–గడప గడపకు కిరణన్న కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడకుండా ఉండాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. అర్హతే అధారంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పథకాల్ని అందించిన ఏకైక నాయకుడు మన జగనన్న అని పేర్కొన్నారు. గత పాలనలో ప్రభుత్వ పథకం పొందాలన్నా నాయకులు, జన్మభూమి కమిటీల ఇళ్ల ముందు పడిగాపులు కాయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. నేడు జగనన్న సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి నేరుగా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు .తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతల రాహేలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ముప్పా శివయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, గేరా పున్నారావు, మెరిగల రవిబాబు, పెద్ది మురళీకృష్ణ, ముప్ప చిన్న, సూరి, కొండపాటూరు సుబ్బారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

పెదనందిపాడు: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నన్నారు. మండలంలోని 720 డ్వాక్రా గ్రూపుల్లోని 6,826 మంది సభ్యులకు రూ. 5,13,51,000 చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో మహిళలు కూడా భాగస్వాములే అని తెలిపారు. పిల్లల చదువు విషయంలో వెనుకాడవద్దని, వచ్చిన ప్రతి రూపాయిని వారికి భవిష్యత్ కోసం ఖర్చు పెట్టాలని సూచించారు. పిల్లలను పనిలోకి పంపకుండా చదువు చెప్పించాలని తెలిపారు. ఈ మేరకు తల్లిదండ్రుల నుంచి మాట తీసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో మరలా వైఎస్. జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి అవ్వడానికి శాయశక్తులా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, వైస్ ఎంపీపీలు షేక్ ఖాశింబీ, కమ్మ సాంబశివరావు, పెదనందిపాడు–1 ఎంపీటీసీ సభ్యురాలు మేడిద మాలతి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎం. సుబ్బారావు, సీసీలు మాధవి, సుబ్బారావు, శ్రీనివాసరావు, ఆర్ అండ్ బీ రాష్ట్ర డైరెక్టర్ పిల్లి మేరి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, యానిమేటర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతోనే మండలాభివృద్ధి

సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో దుర్గాప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ప్రత్తిపాడు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే మండలాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీడీవో కె. దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ, పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఉద్యానశాఖ, ఐసీడీఎస్.. ఇలా పలు శాఖల అధికారులు వారి శాఖల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న పథకాల్ని వివరించారు. ఉపాధి హామీ ఈసీ లక్ష్మీపతి మాట్లాడుతున్న సమయంలో సర్పంచులు పలు ప్రశ్నల్ని లేవనెత్తారు. గతంలో చేసిన పనుల్ని ఇప్పుడు చేసుకునేందుకు అవకాశం ఉందా లేదా ? అని ప్రశ్నించారు. ఆయన ఉందని చెప్పారు. దీనిపై సర్పంచులు మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది గ్రామాల్లో నిర్వహించిన సభల్లో గతంలో చేసిన పనులకు సంబంధించినవి మరలా చేయడానికి వీల్లేదని చెబుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సయోధ్యతో పనుల్ని నిర్వర్తించడం ద్వారా గ్రామాలను, మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించవచ్చని చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు పెదకాకాని మండల సర్వసభ్య సమావేశం

పెదకాకాని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బి.వి.మల్లేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండల అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకాకాని: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ ఈ పీహెచ్. ఖాన్ తెలిపారు. గ్రామంలోని కాశీ గార్డెన్, ఎన్టీఆర్ కాలనీ, వడ్డెర కాలనీ, బైపాస్ ఏరియాల్లో లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కొప్పురావూరులోనే ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 1 గంట వరకూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

రేపు పశువులకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు రూరల్: పట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఈనెల 11వ ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వై. వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమియో, ఆయుర్వేద, అల్లోపతి పశు వైద్య విధానాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించనున్న శిబిరాన్ని ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముందుగా 9705383666 నంబర్‌కు ఫోన్ చేసి తమ వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని తెలిపారు.

మాత్రతో పురుగులను 'నులి'వేద్దాం

పలు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రల పంపిణీ



యనమదల హైస్కూలులో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి మేరి యునిస్



పొన్నూరు హైస్కూలులో విద్యార్థులకు మాత్రల పంపిణీ

ప్రత్తిపాడు: నులి పురుగులతో రక్తహీనత బారిన పడే అవకాశం అధికంగా ఉంటుందని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డీ వార్మింగ్ డే నిర్వహించారు. గొట్టిపాడు పీహెచ్‌సీ పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మేరి యూనిస్ మాత్రలు మింగించారు. పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండు నుంచి 19 సంవత్సరాలున్న 3,059 మంది విద్యార్థులు, చిన్నారులతో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.

ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్య మేఘన ఆధ్వర్యంలో స్థానిక హెచ్‌ఈ పాఠశాలలో డీవార్మింగ్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కె. శ్రీదేవి మండల విద్యాశాఖాధికారులు సీహెచ్. రమాదేవి, లీలారాణిలతో కలిసి విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ మేరి యునిస్, డాక్టర్ దివ్యమేఘనలు వేర్వేలు కార్యక్రమాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న వారిలో ఆకలి లేకపోవడం, నీరసంగా ఉండటం, తరచూ కడుపునొప్పి, వికారం వంటి సమస్యలు కనిపిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో చెల్లమ్మ, సీహెచ్‌వో స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పొన్నూరులో..

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు పాల్గొని విద్యార్థులతో మాత్రలు మింగించారు. డాక్టర్ మహమ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ నులిపురుగులు చిన్న సమస్యగా కనిపిస్తుంది గానీ, చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. చేతులు శుభ్రంగా వుంచుకోవడం వల్ల నులిపురుగుల సమస్య నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేబ్రోలులో...

నులిపురుగుల నివారణపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శైలజ తెలిపారు. మండలంలో శుక్రవారం నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 19 ఏళ్ల లోపు వారందరికీ అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. చేబ్రోలులోని చీలిపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి విద్యార్థులకు టాబ్లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వైద్యాధికారులు అబ్రహం లింకన్, శైలజ మాట్లాడుతూ నులి పురుగుల వల్ల ఆకలి తగ్గిపోవడం, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, పోషకాహార లోపం, రక్తహీనత, తరచూ ఇన్ఫెక్షన్లకు గురవుతారని తెలిపారు. భోజనానికి ముందు, మల విసర్జన తరువాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వండిన ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని చెప్పారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

నగరంపాలెం: దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతుల్ని వెంటనే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్స్యూరెన్స్ ద్వారా యాభై శాతం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద ఘటనపై ఈనెల 12న కలెక్టరేట్‌లో జరగనున్న స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, తెలుగు రైతు సంఘం నేత కల్లం రాజశేఖర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ పాల్గొన్నారు.

రేపు బజరంగ్ సంక్షేమ సంగమం వైద్య శిబిరాలు

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



కళ్లజోళ్లు పొందిన మునిపల్లె గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: బజరంగ్ సంక్షేమ సంగమం సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పెదకాకానిలో నేత్రజ్యోతి, మీ గుండె పదిలం, దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరపీ సేవల్ని ఉచితంగా అందించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లో బజరంగ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. పెదకాకానిలో ఆదివారం లూథర్‌గిరి గ్రంథాలయం వద్ద, సోమవారం శివాలయం రోడ్డులోని బ్రహ్మంగారి ఆలయం వద్ద నేత్ర జ్యోతి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి వారం రోజుల్లో కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియో, గుండె ఆపరేషన్లు, స్టెంట్లు వేయిస్తామని చెప్పారు. దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు, ఉచితంగా త్రిచక్ర వాహనాలు, జైపూర్ కాళ్లు, వెస్ట్రన్ కమోడ్‌లు సమకూరుస్తున్నట్లు వివరించారు.

355 మందికి కళ్లజోళ్ల పంపిణీ

కొరిటెపాడు: పొన్నూరు మండలం మునిపల్లెలో జనవరి 31వ తేదీన నిర్వహించిన నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో అవసరమైన 355 మందికి శుక్రవారం అంబటి మురళీకృష్ణ కళ్లజోళ్లు పంపిణీ చేశారు. బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన 355 మందికి కళ్లజోళ్లు అందజేసినట్లు వివరించారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి రక్ష



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఇంటూరి పద్మావతి

గుంటూరు రూరల్: పేదల ఆరోగ్యానికి జగనన్న సురక్ష అండగా ఉంటుందని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. వెంగళాయపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల్లో భాగంగా ఇళ్ల వద్దకే వైద్యులను పంపి పరీక్షలతో పాటు మందుల్ని కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందజేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం ప్రజలకు ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఇంటూరి అంజిరెడ్డి, సర్పంచ్ లలితకుమారి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో చలపతి విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికీ ఉజ్వల భవిష్యత్తును అందించటం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని లాం నందున్న కళాశాలలో చెన్నైకి చెందిన ఒమెగా హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 105 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. ఒక్కొక్కరికీ ఏడాదికి రూ 2.5 లక్షల వేతనం ఇస్తారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థుల్ని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వి. ఆంజనేయులు, ఒమెగా సంస్థ హెచ్ఆర్ ధరుణ్‌కుమార్, లీడ్ మేనేజర్ విజయన్ అభినందనలు తెలిపారు.

గుంటూరు చేరుకున్న రజకుల పాదయాత్ర

నెహ్రూనగర్: రజకుల్ని ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ నేషనల్ ధోబీ మహాసంగ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు తిరుపతి నుంచి విజయవాడ వరకు చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం గుంటూరు కు చేరుకుంది. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రజకులు 18 రాష్ట్రాల్లో, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్సీలుగా మరికొన్ని చోట్ల ఎస్టీలుగా కొనసాగుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. గుంటూరుకు పాదయాత్రగా వచ్చిన నాగమల్లేశ్వరరావుకు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ఇతర నాయకులు సంఘీభావం తెలియజేశారు.

రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలి



పెదనందిపాడు సచివాలయంలో డీపీవో శ్రీదేవి

పెదనందిపాడు: జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తిచేయాలని గుంటూరు డీపీవో కుసుమ శ్రీదేవి చెప్పారు. శుక్రవారం సాయంత్రం పెదనందిపాడు సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1600 పట్టాలు ఇచ్చారని, వాటిలో 1000 వరకు రిజిస్ట్రేషన్లు అయ్యాయని తెలిపారు. మిగిలిన వాటిని కూడా శని, ఆదివారాల్లో సెలవులు తీసుకోకుండా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట కార్యదర్శి నాగయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్‌కు కొత్త రూపు

- 35 ఏళ్ల తర్వాత అభివృద్ధి పనులు
- శరవేగంగా ఇన్నర్ రోడ్ల నిర్మాణం
- రూ.12 లక్షలతో మరుగుదొడ్ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో రోడ్ల నిర్మాణం

గుంటూరు వెస్ట్: జిల్లా యంత్రాంగానికి అతి కీలక ప్రదేశమైన కలెక్టరేట్, రిజిస్ట్రేషన్ కార్యాలయ ఆవరణలో అభివృద్ధి పనులు పూర్తి కావచ్చాయి. గడచిన 35 ఏళ్లలో ఎప్పుడూ ఇక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి జరగలేదని అధికారులు చెబుతున్నారు. కక్షిదారులు కూర్చుని దస్తావేజులు తయారు చేసుకునేందుకు బ్రిటిషు కాలంలో ఏర్పాటు చేసిన భవనాన్ని 2016 లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూల్చేశారు. కొత్తది కట్టిస్తామని చెప్పి, ఆ తర్వాత వదిలేశారు. ముఖ్యంగా ఈ ప్రదేశాలకు ప్రతి రోజూ వందల సంఖ్యలో వాహనాలతో పాటు ప్రజలు వస్తుంటారు. వారికి కూర్చునేందుకు వసతి గానీ, మరుగుదొడ్లు గానీ లేవు. అంతర్గత రోడ్లు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. వర్షం వస్తే మునిగిపోయి ఉద్యోగులు ఇబ్బంది పడేవారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చొరవతో సుమారు రూ.30 లక్షల వ్యయంతో తారు రోడ్లు నిర్మిస్తున్నారు. ఇవి దాదాపుగా పూర్తి కావచ్చాయి. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి చొరవతో రూ.12 లక్షలు వెచ్చించి ఆధునిక మరుగుదొడ్లను ఇప్పటికే ప్రారంభించారు. కొత్తగా నిర్మించిన ఇన్నర్ రోడ్లతో వాహనచోదకులకు సౌలభ్యంగా ఉంటుంది. అంతేకాదు చిన్న వర్షానికే మునిగిపోయే పరిస్థితి ఉండదు. మూడు దశాబ్దాలకు పైగా నిర్లక్ష్యం నీడలో ఉన్న కలెక్టరేట్ ముస్తాబు, కొత్త రూపుపై ఉద్యోగస్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లు వేస్తారని ఊహించలేదు



వర్షాలకు ఇక్కడ నీరు నిలిచిపోయేది. చాలా ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం చక్కటి నాణ్యతతో రోడ్లు నిర్మిస్తున్నారు. ఇది మాలాంటి వారికే కాకుండా అందరికీ ఉపయోగం. నాకు తెలిసి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోడ్లు వేయడం ఇదే తొలిసారి. అధికారులకు కృతజ్ఞతలు. –జుబేర్, స్టాంప్ వెండార్

కక్షిదారులకు ఉపయోగం



రిజిస్ట్రేషన్, కలెక్టరేట్‌లకు వివిధ పనులపై ఎంతో మంది మహిళలు వస్తుంటారు. మరుగుదొడ్లు లేకపోవడం వల్ల వారితోపాటు పాటు ఇక్కడే ఉపాధి పొందే మాకు కూడా ఇబ్బందిగా ఉండేది. ఇటీవల జేసీ మేడమ్ మరుగుదొడ్లు ప్రారంభించారు. దీనికి మా జిల్లా రిజిస్ట్రార్ శైలజ కృషి ఎంతో ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు – షేక్ ఖాజా, నోటరీ సహాయకుడు.

కార్పొరేటర్ల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం : కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల్ని సత్వరం పరిష్కరించాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. వార్డుల వారీగా అభివృద్ధి పనుల్లో కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్ర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్ని కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ తన చాంబర్‌లో శుక్రవారం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులకు సంబంధిన బిల్లుల ఆన్‌లైన్, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యల్ని ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.